

# తీరని సమస్య

కొడవటిగంటి కుటుంబరావు

ద్రౌపది రంభఅని ఎవరూ ఎన్నడూ అనలేదుగాని, పదేళ్ల క్రితంకూడా ఎరిగినవాళ్లు, "దానికేం? చక్కగా, కనుముక్కు తీరుగా ఉంటుంది," అనుకునేవాళ్లు. ఇప్పుడెవరన్నా దాని పెళ్లివిషయం మాట్లాడేప్పుడు, "ఆఁ, ఏంచూసి చేసుకుంటారు, బాబూ? వాళ్ల నాన్న ఇచ్చే కట్నంచూశా? దాని అందచందాలుచూశా?" అని చప్పరిస్తున్నారు. ద్రౌపది మారిపోయింది.

ఎందుకు మారదూ? ఇరవైతొమ్మిదికూడా వెళుతుంది, ఇంతవరకూ పెళ్లికాలేదు; అయేటట్టుకూడా లేదు. బియ్యే పాసయింది. ఉద్యోగంలేదు. అన్న కామేశ్వరరావు రెక్కలమీద సంసారం నానా అగచాట్లుగా వెళుతున్నది. అతనికి అప్పుడే ఆరుగురు పిల్లలు. రోగిష్టి పెళ్లాం. పిల్లన్ని కనటానికి తప్ప మిగతాఅన్ని పనులకీ ఆవిడకి రోగమే. ఆ రోగిష్టి పెళ్లాన్ని కనిపెట్టుకుని ఉండేటందుకు రోగిష్టి అత్తగారు. ఒక జల్లుపడ్డా, కాస్సేపు నీళ్లల్లో నానినా ఆవిడకి కాళ్లుపట్టుకుపోయి యమబాధ పడుతుంది., ఆచారవంతురాలు గనక నీటిలో నానటం రోజూ ఉంటుందనే చెప్పొచ్చు. ముసలాయనకి-- అంటే ద్రౌపది తండ్రికి— ఆస్తి పోయిననాటి నుంచి మతిసరిగాలేదు. అస్తమానం ఇంటోనే కూచుంటాడు. ఇంటి ఇబ్బందులన్నీ ఆయన్ని, పాపం, బాధిస్తూంటాయల్లే ఉంది. వాట్టిని గురించే మననం చేస్తూఉంటాడు. ఎప్పుడన్నా కామేశ్వరరావు తండ్రిమీద విసుక్కుంటాడు.

"ఆర్చేవాడివా, తీర్చేవాడివా? నీ కెందుకయ్యా? ఏంరోగాలో, ఏంబాధలో, ఏం దరిద్రమో మేం పడుతున్నాంగా? వేళకింత తిని హాయిగా కూచో, ఏబాధా లేదనుకో."

ముసలాయనకి అది యిష్టంలేదు. ఎద్దుదున్నితే జోరీగ రొప్పిందన్నట్టు, నిజమైన శ్రమంతా కామేశ్వరరావు పడుతుంటే, ఆతనికి సానుభూతిగా కాబోలు, కర్మ, ముసలాయన మూలుగుతూ ఉండేవాడు. అటువంటి పరిస్థితిలో కామేశ్వరరావే తనని కోప్పడేసరికి ఆయనకి కష్టంవేసేది. వెంటనే ద్రౌపదిమీద విరుచుకుపడేవాడు :

"నీ మొహం తగలెయ్యా, నీ చదువు చట్టుబండలుగానూ! నా ఆస్తంతా నీ చదువుకిందే ధారపోశానే! నీ చదువంతాపెట్టి ఒక్కరూపాయి సంపాదించగలవుటే? ఆ డబ్బంతా వాడికింద ఖర్చుపెట్టి ఏ ఇంగ్లండో పంపిస్తే వాడికి వేలకువేలు జీతంవచ్చి ఉండునుగదే! వేలకువేలు! నీ మొహాన దేవుడేంరాత రాశాడోగాని నిన్నెవడూ పెళ్ళయినా చేసుకోడేమే? కుంటివాళ్ళకీ, గుడ్డివాళ్ళకీ క్షణంలో పెళ్ళవుతుందిగాని నీకుమటుకు కాదే! నీ కసలు మొగుడంటూ పుట్టి ఉంటేగా?"

వీటన్నిటికీ ద్రౌపది సమాధానం చెప్పగలదు. కాని ఏమిటిలాభం? ఒక్కోసారి ఈ మాటలకు ద్రౌపది ఏడిచేది. కాని పైవాళ్లు, "ఛీ, ఊరుకో. మతిలేనివాడి మాటలు పట్టించుకుంటారా?" అని సమదాయించేవాళ్లు. సమదాయింపు సులభం. గురిలేనివాడు రాయి విసిరినా తగిలితే నొప్పెత్తుతుంది. మతిలేనివాడితో కలిసి ఉంటూ మతిగలిగిన మనిషల్లే ఏళ్లతరబడి ఉండటం చాలా కష్టం. పిచ్చి, హిస్టీరియా మొదలైనవి మానసిక అంటు వ్యాధులు...ద్రౌపదికి అనేకసార్లు సందేహం కలిగింది, తనకు మతి సరిగా ఉందా అని...

ఇంటిల్లిపాదికీ పనిచెయ్యటానికి ఆరోగ్యంగా ఉన్న మనిషి ఇంటి కంతకీ ద్రౌపది ఒకతే. ఆమె ఆ యింటో చేసేపని ఎవరన్నా సంపన్నులకి చేస్తే నెలకొక వందరూపాయి లిస్తారు. కాని, కామేశ్వరరావేం ఇవ్వగలడు. అతను తెచ్చుకునేదే నూట

పాలిక. అందుచేత ద్రౌపది ఈచాకిరీయావత్తూ తన సొంతానికనుకునే చెయ్యాలి.

దురదృష్టవశాత్తూ ఈ కొంపలో ఈ చాకిరీ తప్పిస్తే ద్రౌపదికి సొంతం ఇంకేమీ లేదు. ఈ ఇల్లు తనదనీ, ఈ ఇంట్లో తనకు సహజమైన స్థానం ఉందనీ ద్రౌపది విశ్వసించటం మానేసి అయిదారేళ్ళయింది.

ముసలాయన మతిపూర్తిగా చెడకముందే, "దీని పెళ్ళయితేనేగాని నాకు మంచిరోజులు రావు. చక్రంచూసినవాడల్లా ఆ మాటే అంటున్నాడు." అని ప్రారంభించేడు. కాలక్రమాన ఈ పాటకి చాలా సంగతులు చేరాయి. "రోజూ లేచి దీని మొహంచూసి బయటికెళ్ళితే ఎవడూ ఎర్రపిగానీ చేతిలో పెట్టడుగదా!"...దీనికి పెళ్ళయ్యేదేమిటి? నా అదృష్టం తిరిగేదేమిటి?" ...ముసలాయన అట్లా ఎడమైపోయాడు.

కామేశ్వర్రావు మరోరకంగా ఎడమైపోయినాడు. అతను చెల్లెల్ని పోషించలేకపోవటం గాని, ఎట్లాగైనా ఆమె పెళ్ళి అయిపోయి కాపరానికి వెళ్ళిపోతే తనభారం కొంత తగ్గుతుందనుకోవటంగాని అయితే ద్రౌపది అంతగా విచారించి ఉండదు. ఆమెకూడా చదువుకున్నదే, అర్థం చేసుకోగలదే. కాని కామేశ్వర్రావు అచ్చగా అంతటితో ఆగలేదు; ఆమెకు పొట్టి చచ్చుసంబంధాలు తెచ్చి ముడిపెట్టాలని తొందరపడ్డాడు. అందమూ, గుణమూ లేనిచోట డబ్బుకోసం గడ్డితినేవాళ్ళనే మనం ఎంతో నీచంగా చూస్తాం. అందమూ, గుణమూ, డబ్బూకూడా లేని దిక్కుమాలిన వెధవలకి తన చెల్లెల్ని అంటగట్టాలని చూశాడు కామేశ్వర్రావు. ఆ సంబంధాలను గురించి ద్రౌపదితో అబద్ధాలాడి దొరికిపోయినాడు. ఆమె వొదిలిపోతే చాలు, అవతల ఆమె గతి ఏమైనా సరే అనే స్థితికి అతను వచ్చాడని తెలిసినాక ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టేసింది. అంత అసమర్థపుస్థితిలో ఉన్న ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టటంకంటె ఇంకే విధంగా శిక్షించగలదు?

అతనికి తనమీద సోదరప్రేమ లేకపోతే లేకపోయింది; తన పిల్లలకీ, పెళ్ళానికీ, చివరకి అత్తగారికీకూడా చచ్చేట్టు చాకిరి చేస్తున్నందుకు కామేశ్వర్రావు తనమీద ఆపాటి కృతజ్ఞత చూపకూడదా? ఏ భ్రష్టుణ్ణో, అతనిమాట చొప్పునే, పెళ్ళాడి తన దారిన తాను కాపరం వెళ్ళిపోతే మర్నాడు ఈ కుటుంబంగతి ఏంకాను? ఆ సంగతి అతను ఆలోచించలేడా?

తన తండ్రీ, అన్నా దూరమైనాక ఆ ఇంట్లో ద్రౌపదికి దగ్గరవాళ్ళెవరు? ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పుకుంటుంది? బయటికి అనుకోవటానికి లేని ఈ బాధ ఆమె మనస్సును తొలిచి డొల్ల చెయ్యసాగింది. ఇది ఆమె జీవితానికి తెగని సమస్య. ఇందులో పెళ్ళీ, డబ్బూ, స్వేచ్ఛా-ఈ మూటి తాలుకు పోగులూ చిక్కుపడి ఉన్నై.

ద్రౌపది తనకు పెళ్ళి కాలేదని మనోవ్యాధి పాలుకావటం ఇతరులకెంత సహజంగా కనిపించినా, ఆమె విషయంలో అది కృత్రిమంగా తయారయిన సమస్యే. ఎందుకంటే ఒకప్పుడు ఈ తండ్రే ఆమె జీవితానికి చదువే ముఖ్యమైన విషయంగానూ పెళ్ళి అముఖ్యంగానూ మాట్లాడాడు. ఒకప్పుడామెను చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తోసేసి, అవమానించాడు. అది ఆయనకు జ్ఞాపకంలేదు. ద్రౌపదికి జ్ఞాపకంఉంది. అదికాక మొగుడులేడనే చింతే అయితే ఏ ఆడదాన్నీ కుంగదీయదు; మొగుళ్ళుపోయి వైధవ్యంమీదపడి రాళ్ళల్లే ఉన్న వితంతువులు చాలామంది ఉన్నారు.

కాని ఆ వాతావరణంలో ఇప్పుడు ద్రౌపది మామూలుమనిషికాదు. ఆమెకిప్పుడు పెళ్ళితప్ప గత్యంతరంలేదు. ఈ ఇల్లూ, వాతావరణమూ వొదిలించుకోవాలంటే పెళ్ళితప్ప మరోమార్గం లేదు. పెళ్ళయితే తన మిగతా సమస్యలన్నీ తీరుతాయి. ఎంతకీ ఆ పెళ్ళే కాకుండా ఉంది.

"నేను ముబ్బిళ్ళోకూచుని నిజం తెలుసుకోకుండా ఉన్నానా? కామేశ్వర్రావు నన్ను చేసుకోమన్న సంబంధాలకంటే నాకు మంచివి రాదగవా? అతను నా యోగ్యత సరిగానే అంచనాకట్టాడా? నన్నుగురించి నాకు ఎంత అధమమైన అభిప్రాయం తెచ్చిపెట్టుకున్నా, ఇతరులకు నామీద ఇంకా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుగా తోస్తుందే! ఏమిటి కారణం? ఇంకా ఎంతని కుంగను? దానికి అంతెక్కడ?" అనుకునేది ద్రౌపది. ఒక్కసారి ఆమెకి ఆత్మవిశ్వాసం ఏమీ లేకుండాపోయి, "ఈ సారి ఎవడన్నా పెళ్ళిచేసుకుంటాననివస్తే కళ్ళు మూసుకుని ఒప్పేసుకుంటాను. నేననవసరంగా ఎందుకు

మథనపడాలి? నిండా మునిగినవాడికి చలేమిటి? ఏ పెళ్ళి చేసుకున్నా ఇంతకన్నా దరిద్రంగానూ, నిర్బంధంగానూ, మనోవ్యాధిగానూ ఉండదుగదా? ఏదైనా ఉన్నవాళ్ళకి పోతుందని భయంగాని, ఏమీ లేనినాబోటి దానికి పొయ్యేదేమిటి? ఈసారి ఎవడు వచ్చినా చేసుకుంటాను. ఇది నిశ్చయం," అనుకునేది.

ద్రౌపదికి పరీక్షగా ఒక సంబంధంవచ్చింది. వరుడికి యాభైఅయిదేళ్లు. ఇటీవలే భార్య పోయింది. అయిదారుగురు సంతానం. ఆయనకి తలిదండ్రులున్నారు. తండ్రికి పిచ్చి, తల్లి వ్యాధి పీడితురాలు. ఆచారవంతురాలైన విధవ చెల్లెలొకతె ఉంది. చిన్నపిల్లని చేసుకోమని ఆవిడ గోలట. ఈయన కాస్త లోకజ్ఞాని. పెద్దదాన్నే చేసుకుంటానని వచ్చాడు. ద్రౌపదినీ చూసి వెళ్లాడు.

ఆయన విషయాలన్నీ వినగానే ద్రౌపదికి ఆపుకోలేకుండా నవ్వొచ్చింది. ఈ పెళ్ళయితే తన జీవితంలో ఏమీ మార్పుండదు. ఇక్కడవున్న మనుషులకు నకళ్లేవాళ్ళూనూ. వీళ్లు చూసినట్టే తనని వాళ్ళూ పరాయిగా చూస్తారు. ఎందుకీ పెళ్ళి?

"నా కక్కర్లేదీసంబంధం?" అందామని నోటిదాకా వచ్చింది. కాని బలవంతాన నోరు నొక్కేసుకుంది.

మర్నాడు కామేశ్వర్రావు కబురుతెచ్చాడు. ఆ పెద్దమనిషికి ద్రౌపది మరీ సన్నగా, జబ్బుగా కనిపించిందిట. ఆయన ఇంకో సంబంధం—పద్ధెనిమిదేళ్ళ పిల్లని—స్థిరపరుచుకున్నాడుట.

# మాటలూ, చేతలూ....

ప్రస్తుతం మన దేశానికి ఏమొచ్చిందని ఇటీవల ఒకరు అడిగారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు చదువుతే, ఆయనకి ఆ సందేహమే రాకపోవును. ఇంగ్లీషు రచయిత గాల్స్‌వర్దీ వ్రాసిన ఒకానొక నాటకంలో పాత్రలవలె, ప్రతివ్యక్తీ తన జీవితంలో గడిచిపోయిన రోజులు తలుచుకుంటూ అప్పటి బ్రదుకే బాగుందని నిట్టూర్పులు విడుస్తున్నాడు. ఉదాహరణకి చూడండి: పండిట్ నెహ్రూకి ఇదివరలో తను జైలులో ఏకాంతంగా, స్వేచ్ఛగా గడిపిన రోజులే బాగున్నాయనిపిస్తోంది, ఇప్పటి ప్రధాన మంత్రిత్వపు బాధ్యతలకన్న. గవర్నర్ జనరల్ రాజాజీకి తన పదవి ఏమాత్రం ఆనందం ఇవ్వడంలేదుట. పైగా, పంచతంత్రం కథలో మొసలిమీద స్వారి చేసిన మర్కటంవలె, ఆయనగారి గుండెకాయ బెంగాల్‌లో వదిలేశాడట. డాక్టర్ అంబేద్కర్ చాలా వ్యాకులపడుతున్నాడు, తనకి ఏమాత్రం ఇష్టంలేని ప్రభుత్వంతో కలిసి పని చేయవలసిన నిర్బంధం కలిగిందని—ఎవరు ఆ నిర్బంధం చేస్తున్నారో పరమేశ్వరుడికి తెలియాలి!

పోగా ఇక మామూలు ప్రజానీకం సంగతి. నాయకుల ఉపన్యాసాల్లో యీ ప్రజసంగతి వస్తూనే ఉంటుంది. దేశభక్తి అలవరుచుకోమనీ, శత్రువుల్నికూడా ప్రేమించగలగాలనీ, త్యాగబుద్ధి కలిగి అంతా సోదరులవలె జీవించాలనీ, కోరికల్ని జయించాలనీ, నాయకులు ప్రజల్ని హెచ్చరిస్తూనే ఉన్నారు.

ప్రజలు ఇవన్నీ చేస్తూనే ఉన్నారు: వాళ్ళకి కోరికలు ఉన్నా అవి తీరేవికావు. శత్రువుల్ని కూడా ప్రేమించకపోతే బతకడం కష్టం. గంగానది పొంగినట్టు వస్తువుల ధరలు హెచ్చుతూండే యీ రోజుల్లో ప్రజలు చెయ్యగలిగేది త్యాగంతప్ప ఇంకేమీలేదు.

మామూలు మనిషికి నేడు కావలసింది ఏమిటంటే, బ్రదకడానికి ఆస్కారం: తన కష్టాలు కాస్త తగ్గడం. నాయకులు యీ విషయంలో ఏమైనా సాయపడగలరా?

—"గోతమి"